క్లుప్తంగా

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి



అనంతపల్లి ఎర్రకాలువ బ్రిడ్జి వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

నల్లజర్ల: జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ సోమవారం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలు పరిష్కరించేలా పని చేయాలని ఈ సందర్భంగా ఆయన ఇక్కడి సిబ్బందికి సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల మిస్సింగ్ కేసుల్లో వెంటనే స్పందిస్తే ఫలితం ఉంటుందన్నారు. అనంతరం నల్లజర్ల సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐ వెంకటసురేష్‌లతో కలసి ఎర్ర కాలువ వరద పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

ఐ.పంగిడి హైస్కూల్ విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు



ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి జెడ్పీ విద్యార్థి బానాల జ్ఞానేశ్వర్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. సోమవారం మధ్యాహ్నం పాఠశాలలో జ్ఞానేశ్వర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో జ్ఞానేశ్వర్ 576 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడని ప్రధానోపాధ్యాయుడు మంగిన శ్రీరామారావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం ఆనందంగా ఉందని ఆయనన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తోట నాగలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్‌ను అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు బానాల మహేష్, మోహనకుమారి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ ప్రూఫ్ డ్రెస్‌లు

తాళ్లపూడి: వేగేశ్వరపురం పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి వర్షాలకు తడవకుండా ఆ పంచాయతీ రెయిన్ ప్రూఫ్ డ్రెస్‌లు, ఇతర పారిశుధ్య పరికరాలు సమకూర్చింది. ఆ గ్రామ సచివాలయం వద్ద సోమవారం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు చేతుల మీదుగా వాటిని పారిశుధ్య కార్మికులకు అందజేశారు. రేడియం జాకెట్‌లు, రెయిన్ కోట్లు, చేతి గ్లోవ్స్, షూస్ అందజేశామని ఆయన వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్మిత అనుచిత వ్యాఖ్యలను ఉపేక్షించం

కొవ్వూరు: సోషల్ మీడియా వేదికగా తెలంగాణా క్యాడర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఇటీవల దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలను ఏపీ దివ్యాంగుల ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సతీష్ తీవ్రంగా ఖండించారు. ఆయన కొవ్వూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు సివిల్స్ కోటా ఉండరాదని స్మితా సబర్వాల్ వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. తెలంగాణలో మొట్టమొదటి ఉద్యోగాన్ని దివ్యాంగ అభ్యర్థికి కేటాయించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ ఐఏఎస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని సతీష్ కోరారు.ఆమె తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అర్చక క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు సన్మానం



అర్చక పురోహిత క్రికెట్ టోర్నీ విజేత జట్టును సత్కరిస్తున్న దృశ్యం

చాగల్లు: రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అర్చక పురోహిత క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన కొవ్వూరు గాయత్రీ లెవన్ టీమ్‌ను సోమవారం సాయంత్రం చాగల్లులోని రాజరాజేశ్వరి ఆలయంలో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్చక వైదిక ఆగమ స్మార్త అధ్యక్షుడు శంకరమంచి శాంతి బాబు విజేత జట్టు సభ్యులను అభినందించారు. ఈ జట్టు మరెన్నో విజయాల సాధించాలని రాష్ట్ర పురోహిత సంఘ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ వారణాసి హనుమంతశర్మ, చెరుకూరి సుబ్బారావు శర్మ, బొండలపాటి సుబ్రహ్మణ్య శర్మ, కొటారు వీరరాఘవులు, కంటిపూడి వెంకట్రావు తదితరులు కొనియాడారు . కార్యక్రమానికి హాజరైన పురోహితులు తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకెళ్లారు.

మునుగుతున్న లంక పంటలు



ఉసులుమర్రు వద్ద గోదావరి ఉధృతి



ఖండవల్లిలో ఇసుక ర్యాంపు బాట నుంచి పచ్చగడ్డి మోపులతో రైతులు

- గోదావరి వరదలో చిక్కుకున్న 800 ఎకరాల్లోని పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- ఏటిగట్టుపై సిబ్బంది పహారా

పెరవలి: వశిష్ట గోదావరికి వరద పోటెత్తింది. ఇరిగేషన్ అధికారులు ధవళేశ్వరం వద్ద ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమంలో మండలంలో విస్తరించి ఉన్న గోదావరి దిగువ లంక భూముల్లోని పంటలు సోమవారం నీట మునిగాయి. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓడూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల దిగువ లంకల్లోని సుమారు 800 ఎకరాల్లోని పంటలు ముంపులో చిక్కుకున్నాయి. ఈ లంకల్లోని అరటి, కంద, వంగ, బెండ, బీర, ఆనబ, చిక్కుడు, క్యాబేజీ, దొండ పందిర్లు, పచ్చిమిరప, ఆకుకూరలు ముంపులో ఉన్నాయి. గత నాలుగు రోజులుగా నిలకడగా ఉన్న వశిష్ట గోదావరి వరద సోమవారం ఉదయం నుంచీ గంట గంటకూ పెరిగింది. ఈ క్రమంలో పలు రకాల పంటలు నీట మునడంతో వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగు చేసిన అరటి, కంద పంటలు ఎక్కడ దక్కకుండా పోతాయోనని రైతులు కలవర పడుతున్నారు. ప్రస్తుతం గోదావరికి సుమారు 12 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. వరద మంగళవారం ఉదయానికి మరింతగా పెరిగి లంకలను పూర్తిగా ముంచెత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై నెలలో రెండుసార్లు గోదావరి ఉగ్ర రూపం దాల్చడంతో లంక పంటలన్నీ తుడుచుపెట్టుకుపోయాయి.



తీపర్రు వద్ద పహారా కాస్తున్న సిబ్బందికి ఆదేశాలిస్తున్న తహసీల్దార్ సుధ, ఎంపీడీవో హిమమహేశ్వరి

పర్యవేక్షిస్తున్న అధికారులు

గోదావరికి వరద పోటెత్తినందున నదిలోకి ఎవరూ దిగకుండా ఏటిగట్టుపై సిబ్బంది పర్యవేక్షించాలని పెరవలి తహసీల్దార్ డి.సుధ ఆదేశించారు. మండలంలోని కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, కడింపాడులోని పుష్కరాల రేవుల వద్ద రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పహారా కాస్తున్నారు. ఈ ప్రాంతాలను సోమవారం తహసీల్దార్ పరిశీలించి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 18 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్న గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా పహరా ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీవో కె.హిమ మహేశ్వరి, వరద సహాయక మండల ప్రత్యేకాధికారి సునీల్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మునిగిన చేలు.. కుళ్లుతున్న నారు

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వందలాది ఎకరాల్లోని వరి చేలు నీట మునగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టిన పెట్టుబడి వృథా అని వారు వాపోతున్నారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, కాపవరం గ్రామాల్లో వరి చేలు ఇప్పటికీ నీట మునిగి ఉన్నాయి. ఐదు రోజులుగా కానూరు బాడవా పూర్తిగా నీట మునిగి ఉండడంతో నారు కుళ్లిపోయిందని రైతులు తెలిపారు. మరికొన్ని రోజుల పాటు పంటలు నీటమునిగి ఉంటే పూర్తిగా పనికి రాకుండా పోతాయని చెబుతున్నారు. ఇదే జరిగితే మరలా నాట్లు వేయడానికి నారు దొరకదంటున్నారు.

వరద ముంపులో 7,110 ఎకరాలు

- ఐదు రోజులుగా నీటిలోనే వరిపంట
- గోష్పాద క్షేత్రం స్నాన ఘట్టాన్ని ముంచెత్తిన గోదావరి
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

కొవ్వూరు: భారీ వర్షాల వల్ల సోమవారం సాయంత్రానికి కొవ్వూరు డివిజన్‌లో 7,110 ఎకరాల్లోని వివిధ పంటలు ముంపు బారిన పడినట్టు అధికారులు లెక్కలు తేల్చారు. ఇందులో అత్యధికంగా 7,029 ఎకరాల్లోని వరిపంట నీట మునిగింది. 80 ఎకరాల్లోని చెరకు పంట నీటిలో ఉంది. మండలాల వారీగా నిడదవోలులో 3,392, ఉండ్రాజవరంలో 2,000, గోపాలపురంలో 881, దేవరపల్లిలో 931, తాళ్లపూడిలో 689.5, కొవ్వూరులో 560, పెరవలిలో 412, నల్లజర్లలో 478, చాగల్లులో 687 ఎకరాల్లోను వరి పంటను వరద నీరు ముంచెత్తింది. ఐదు రోజులుగా ముంపు తీవ్రత పెరుగుతోంది. ఫలితంగా వరి సాగుదారులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.ఎక్కువ రోజులు నీటిలో నానితే వరిమూన కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి..

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. స్థానిక గోష్పాద క్షేత్రం స్నానఘట్టాలను ముంచెత్తింది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద సోమవారం మధ్యాహ్నం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోష్పాద క్షేత్రంలో భక్తులను స్నానాలకు దిగకుండా పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రికి ధవళేశ్వరం ఆనకట్ట వద్ద వరద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రసుత్తం గోష్పాద క్షేత్రంలో ఒడ్డును తాకుతూ వరద ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి గోష్పాద క్షేత్రాన్ని వరద ముంచెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు అఖండ గోదావరి వెంబడి గట్టును పర్యవేక్షిస్తున్నారు. ముందస్తుగా ఇసుక మూటలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 40 వేల ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచామని ఏజీఆర్‌బీ ఏఈ ఆర్. సునీల్ బాబు తెలిపారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఏటిగట్ల పటిష్టతపై సీఎంతో చర్చించా

- మంత్రి కందుల దుర్గేష్
- ఎర్ర కాలువ ముంపు గ్రామాల్లో మంత్రి పర్యటన

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ఏటిగట్ల ఆధునీకరణ పనుల విషయమై సోమవారం ఉదయం అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కలసి చర్చించానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు మండలం తాళ్లపాలెం, సింగవరం గ్రామాల్లోని ఎర్రకాలువ ముంపు ప్రాంతాలను పరిశీలించి, పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎర్ర కాలువ వరద ముంపు నివారణే లక్ష్యంగా ఏటిగట్లను పటిష్టం చేస్తామన్నారు. నీట మునిగిన ఇళ్లు, పొలాలను అధికార యంత్రాంగం పరిశీలించాక నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 957 మందికి భోజనం, వసతి కల్పించామన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమణా నాయక్, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, తహసీల్దార్ నాగభూషణం, సర్పంచ్ యర్రా రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో ఎర్రకాలువ ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, అధికారులు

వరదగట్ల బలోపేతానికి కార్యాచరణ

- రైతులకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి హామీ
- గుండేపల్లిలో వరద గట్ల పరిశీలన
- రైతులతో ముఖాముఖి

నల్లజర్ల: వరద తగ్గుముఖం పట్టాక ఎర్ర కాలువ వరదలకు కుంగిపోయిన వరద గట్ల పటిష్టానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రైతులకు హామీ ఇచ్చారు. నల్లజర్ల మండలం గుండేపల్లిలో కుంగిపోయిన ఎర్ర కాలువ వరద గట్లను సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. లోగడ వచ్చిన వరదలకు తుమ్మల గండి డ్యాం, సుందర రామయ్య డ్యాం, తూరిమూల డ్యాంలు కొట్టుకుపోవడంతో వరద ప్రతిసారీ నీరు తమ గ్రామాన్ని ముంచెత్తుతోందని గుండేపల్లి రైతులు పెన్మత్స శ్రీహరిరాజు, ఉన్నమట్ల శ్రీనివాసరావు, సూర్యచంద్రరావు, మండ సత్యనారాయణ తదితరులు కలెక్టర్‌కు వివరించారు. ఇంతవరకూ ఎర్ర కాలువ ముంపునకు దాదాపు 100 ఎకరాల్లోని పంటలు కొట్టుకు పోయినట్టు వారు వివరించారు. వరద తగ్గుముఖం పట్టాక గట్లకు జరిగిన నష్టం అంచనాలు రూపొందించాలని ఇరిగేషన్ డీఈని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వరద ఉధృతికి దెబ్బతిన్న పంటలను పరిశీలించామని, ప్రభుత్వపరంగా తగు చర్యలు తీసుకుంటామని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు. ఈ గ్రామంలో 20 ఎకరాలలో పంటనష్టం జరిగినట్టు చెప్పారు. మండలంలో 543 హెక్టార్లలో వరిపంట, 2.6 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్టు వివరించారు. భారీ వర్షాలకు తొమ్మిది గృహాలు కూలిపోయనట్టు చెప్పారు. ఏడు విద్యుత్ స్తంభాలు పడిపోయాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టడంతో బాధితులు తిరిగి ఇళ్లకు వెళుతున్నారన్నారు. మండలంలో వరద సహాయ విధులకు నియమితులైన గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. మాధురి, మండల ప్రత్యేకాధికారి కృష్ణారావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్, తహసీల్దార్ కృష్ణారావు, మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు



సుబ్బరాజుపేటలో వరద బాధితులకు భోజన పొట్లాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్, సుబ్బరాజుపేట, తీరుగూడెం ప్రాంతాల్లో ఎర్ర కాలువ వరద ప్రభావం తగ్గడంతో అధికారులు సోమవారం పారిశుధ్య పనులపై దృష్టి సారించారు. తీరుగూడెం, సుబ్బరాజుపేటల్లో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ అధికారులతో కలసి పర్యటించారు. ఇక్కడ జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. సుబ్బరాజుపేటలో వరద బాధితులు 60 మందికి భోజన పొట్లాలను మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల రంగారావు, కౌన్సిలర్లు పిట్టా పద్మావతి, కారింకి నాగేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, బీసీ నాయకుడు గంగుల గోపియాదవ్, మున్సిపల్ కమిషనర్ రాంభూల్‌రెడ్డి, ఏఈ హేమంత్, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి లలిత, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వీడని ఎర్ర కాలువ ముంపు

- నీటిలోనే కంసాలిపాలెం, తాళ్లపాలెం పొలాలు, కాలనీలు
- విష సర్పాలతో భయాందోళన చెందుతున్న ప్రజలు

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ముంపు మండలాన్ని వీడలేదు. ఎగువ నుంచి భారీగా వచ్చిన వరద పంటలపై, రోడ్లపై పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, సింగవరం, తాళ్లపాలెం, శంకరాపురం గ్రామాల ప్రజలు ముంపుతో సతమతమవుతున్నారు. కంసాలిపాలెం- మాధవరం, సింగవరం-కంసాలిపాలెం, మాధవరం- కంసాలిపాలెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైతే గ్రామస్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. అత్యవసర పనులపై వెళ్లేందుకు కంసాలిపాలెం, సింగవరం గ్రామాల్లో ఫైర్ సిబ్బంది రెండు బోట్లు ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది సైతం వాటిపై రాకపోకలు సాగిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ గుడి సమీపంలో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కంసాలిపాలెం గ్రామం చుట్టూ వరద చేరడంతో కాలనీల్లోకి నీరు ప్రవేశించుండా ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

మరోవైపు గోదావరి ఉధృతి

ఎర్ర కాలువతో పాటు మరోవైపు గోదావరి కూడా ఉధృతంగా ప్రవహించడంతో పురుషోత్తపల్లి, పందలపర్రు, పెండ్యాల, విజ్జేశ్వరం, అమ్మేపల్లి, కోరుమామిడి, ఉనకరమిల్లి, రావిమెట్ల, సింగవరం, జె.కండ్రిగ, కంసాలిపాలెం, తాళ్లపాలెం గ్రామాల పరిధిలోని సుమారు 7 వేల ఎకరాల వరి, చెరకు, అరటి, కూరగాయల పంటలు నీట మునిగాయి. ఎకరా వరికి పంటకు రూ.15 వేలు ఖర్చుచేశామని, తమ పంట పొలాలను ఎర్ర కాలువ మింగేసిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఆయా గ్రామాల్లో రోడ్లపైనే వలలు వేసి చేపలు పడుతున్నారు. నాలుగురోజులుగా వరద ముంపు కొనసాగడంతో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యావసరాలు కొనుగోలు చేసుకునే అవకాశం కూడా లేకపోవడంతో కంసాలిపాలెం వాసులు ఆర్తాకలితో అలమటిస్తున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణ నాయక్, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, సమిశ్రగూడెం ఎస్సై రమేష్‌లు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. 260 మంది పాడి రైతులకు ఉచితంగా దాణా అందజేశారు.



తాళ్లపాలెంలో వరద ముంపులో పంట పొలాలు



తాళ్లపాలెంలో రైతులకు పశువుల దాణా అందజేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణ నాయక్, అధికారులు



ఉండ్రాజవరం మండలం పసలపూడిలో నీటి మునిగిన వరి చేలు

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: ఎర్ర కాలువ వరద ఉధృతికి మండలంలోని కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లోని సుమారు 2,500 ఎకరాల్లోని పంటలు ఇప్పటి వరకూ ముంపులో ఉన్నాయి. సోమవారం మరో 500 ఎకరాలు ముంపు బారిన పడినట్టు రైతులు చెబుతున్నారు. మూడు రోజులుగా వరి పంట నీటిలో ఉండడంతో రైతులు పంటలపై ఆశలు వదులుకున్నారు. ఎర్ర కాలువ ప్రవాహం ఎప్పుడు తగ్గుముఖం పడుతుందోనని, తమ చేలో నీరు ఎప్పటికి తగ్గుతుందోనని వారు ఎదురు చూస్తున్నారు. ఎర్ర కాలువ ముంపునకు గురైన కాల్దారి గ్రామంలోని పంటలను సోమవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గోస్తనీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈర్పిన సత్యనారాయణ, సర్పంచ్ చీపుళ్ల కుమారి, అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పెద్దేవంలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ఏవో రుచిత, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ వరద, భారీ వర్షాల వల్ల మండలంలో 1,696 ఎకరాల్లోని వరి, చెరకు తదితర పంటలు ముంపు బారిన పడ్డాయని మండల వ్యవసాయాధికారి జి.రుచిత చెప్పారు. సోమవారం ఆమె నీట మునిగిన వరి చేలను పెద్దేవం, తిరుగుడుమెట్ట తదితర గ్రామాల్లో రైతులతో కలసి పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొనేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. నీట మునిగిన వరి చేలను ఏవోకు చూపించారు. మండలంలో వరి చేలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. కొవ్వాడ కాలువలో వరద నీరు ప్రవహిస్తోంది.

వర్షాల వేళ ప్రజారోగ్యం జాగ్రత్త

- డీఎం అండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో అమ్మాజీ
- జాన్‌పేటలో వైద్య శిబిరం, పారిశుధ్య డ్రైవ్

తాళ్లపూడి: విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా వైద్య,ఆరోగ్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొవ్వాడ కాలువ వరద నీరు చేరిన అన్నదేవరపేట గ్రామంలోని జాన్‌పేటలో స్థానిక అధికారులు సోమవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. అలాగే ఈ ప్రాంతంలో అన్నదేవరపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం కూడా నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకుని సలహాలు, మందులు అందజేశారు. ఈ క్రమంలో అన్నదేవరపేటను సందర్శించిన డీఎంఅండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు, కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ తదితరులు ఇక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ కొండలరావు వరద నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. సోమవారం గ్రామంలో ముంపు నీరు తగ్గడంతో బ్లీచింగ్ చల్లి, శానిటేషన్ పనులు చేపట్టారు. అనంతరం డీఎల్‌పీవో అమ్మాజీ తాళ్లపూడితో సహా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లోని డ్రైన్లలో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న, పంచాయతీ కార్యదర్శి ఆశాఆలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు

మృతుడి కుటుంబానికి బీమా సాయం అందజేత

దేవరపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవరపల్లికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త కోట సురేష్ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా సాయం విడుదలైంది. బీమా చెక్కును సోమవారం జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు మృతుడి నివాస గృహంలో అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. పలువురు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి ఆరు ఫ్యాన్ల వితరణ

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీకి నల్లజర్లకు చెందిన దాత ఆలపాటి లక్ష్మీనారాయణ సోమవారం ఆరు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. ప్రజారోగ్య పరిరక్షణకు శ్రమిస్తున్న వైద్య,ఆరోగ్య సిబ్బందికి ఫ్యాన్లు లేకపోవడాన్ని గమనించి ఆసుపత్రి సిబ్బంది అడగక ముందే ఫ్యాన్లు బహూకరించడం అభినందనీయమని ఈ పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు దాతను అభినందించారు. ఉద్యోగుల తరపున ఆ సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావుకు ఫ్యాన్ల బిల్లు అందజేస్తున్న దాత లక్ష్మీనారాయణ

రోటరీ మిడ్ టౌన్ అధ్యక్షుడిగా ' రాచర్ల'

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాచర్ల చైతన్యబాబు, కార్యదర్శిగా ఆకుల రాజీవ్, కోశాధికారిగా కొయ్యా కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడిగా గుబ్బల సత్యప్రసాద్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ భవనంలో ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు క్లబ్ మెంబర్‌షిప్ కన్వీనర్ ఇంజే శేఖర్ తెలిపారు.



రాచర్ల చైతన్యబాబు